సాక్షి
ప్రకాశం
శనివారం । 11 । మార్చి । 2023



పేదరికం లేని సమాజమే లక్ష్యం
పేదరికం లేని సమాజమే సీఎం జగనన్న లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. - IIలో..

విధి ఆడిన ఆట.. తడబడిన మాట



పశువుకు వైద్యం చేస్తుండగా గేదెకొమ్ము విసరడంతో స్వరపేటికకు తీవ్ర గాయమైన చిరుద్యోగి ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక సాయం కోసం అర్థిస్తున్నాడు. - IIలో..

గరిష్టం/కనిష్టం
32 /22

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగటి ఉష్ణోగ్రతలు అధికం.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి

- పొన్నూరు నుంచి శ్రీశైలానికి సైకిల్ యాత్ర



శ్రీశైలం సైకిల్‌యాత్ర చేస్తున్న పొన్నూరుకు చెందిన సత్య

త్రిపురాంతకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అభిమానంతో శ్రీశైలం సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు వైఎస్సార్ సీపీ అభిమాని ఎం.సత్య సైకిల్ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు నుంచి శ్రీశైలం వరకు సైకిల్‌పై యాత్ర చేస్తున్నానని మార్గ మధ్యంలో ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. పొన్నూరు వైఎస్సార్ సీపీ నాయకుడు కిలారు రోశయ్య ఆధ్వర్యంలో ఈయాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఈయనకు వైఎస్సార్ యూత్ సభ్యులు ఆహ్వానం పలికి ఆయనతో పాటు కొంత దూరం బైక్ ర్యాలీ చేశారు.

బూరేపల్లి కొండ వద్ద ఏపీఎస్‌పీ బెటాలియన్

- త్వరలోనే ఏర్పాటు చేస్తామన్న డీఐజీ



స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఐజీ వెంకటేశ్వరరావుతో ఎస్పీ మలికా గర్గ్

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వెనుక వైపు ఉన్న బూరేపల్లి కొండ ప్రాంతాన్ని ఏపీఎస్‌పీ డీఐజీ వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థలం విస్తీర్ణం, అక్కడ ఉన్న ఇతర విషయాలను స్థానిక మండల సర్వేయర్‌తో చర్చించారు. కొండ ప్రాంతం 97.40 సెంట్ల విస్తీర్ణాన్ని కలియతిరిగారు. ఈ స్థలంలో నిర్మాణాలకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. దీనితోపాటు అక్కడ ఏవిధమైన మౌలిక వసతులు ఉన్నాయన్న విషయాలను పరిశీలించి తదుపరి ఎస్పీ మలికా గర్గ్‌తో మాట్లాడారు. సోమవారం నుంచి తమ సిబ్బంది 20 మంది వస్తారని, వారు ఇక్కడ ఉంటూ స్థల పరిరక్షణతో పాటు ఇతర కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్లు, అధికారులు, మండల సర్వేయర్ బాబూరావు, వీఆర్‌ఓ రాంబాబు, విలేజ్ సర్వేయర్లు శివశంకర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహించే విద్యాసంస్థలకు సెలవు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించే విద్యా సంస్థలకు సెలవు ఉంటుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రెండో శనివారం పాఠశాలలకు సెలవు లేదు

ఒంగోలు అర్బన్: జిల్లాలోని పాఠశాలలకు నేడు (రెండో శనివారం) సెలవు లేదని వర్కింగ్ డేగా ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి నెలలో 12, 18 తేదీల్లో సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించినందున ఏదైనా ఒక సెలవు దినంలో పాఠశాలను వర్కింగ్‌డే గా ప్రకటించాలని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ తెలిపారన్నారు. ఆమేరకు ఈ నెల రెండో శనివారం పాఠశాలలకు వర్కింగ్ డేగా ప్రకటించారన్నారు. ఈ నెల 14వ తేదీ జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్య శాఖ పంపిణీ చేస్తుందని, సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు సంబంధిత ప్రొఫార్మాను పంపాలన్నారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల, ప్రధాన ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందజేసేలా చూడాలన్నారు.

ఈ క్రాప్ నమోదు.. పకడ్బందీగా

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్కరైతు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో అధికారులు పకడ్బందీగా ఈక్రాప్ ప్రక్రియను పూర్తి చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని రబీ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3,53,774 ఎకరాల్లో పంటలను నమోదు చేశారు. దీని ఆధారంగానే రైతులకు సంక్షేమ ఫలాలు అందుతాయి.

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రబీలో మొత్తం సాగు లక్ష్యం 4,29,000 ఎకరాలు
- ఈ క్రాప్ పంటల నమోదు 3,53,774 ఎకరాలు
- మొత్తం ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు 1,19,190 మంది
- ఎక్కువ శాతం దర్శి, సింగరాయకొండ సబ్‌డివిజన్లలో నమోదు

మార్కాపురం: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 1వ తేదీ నుంచి పంటల ఈ క్రాప్ నమోదు కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. వ్యవసాయశాఖాధికారులు, రైతు భరోసా కేంద్రాల్లో ఉండే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు కలసి సంయుక్తంగా రైతుల ఇళ్లు, పొలాల వద్దకు వెళ్లి ఈ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టారు. ఈ నెల 4వ తేదీ నాటికి నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. రబీలో మొత్తంగా 3,53,774 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేశారు. జిల్లాలో మొత్తం 1,19,190 మంది రైతులు 4,29,000 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అద్దంకి, దర్శి, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, ఒంగోలు, సింగరాయకొండ, యర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ సబ్‌డివిజన్ల వారీగా యాప్ ద్వారా రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం దర్శి, సింగరాయకొండ వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో ఎక్కువ శాతం ఈ క్రాప్ నమోదైంది. దర్శి సబ్ డివిజన్ పరిధిలో 65,210 ఎకరాలకు గాను 58,199 ఎకరాలను, సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలో 57,226 ఎకరాలకు గాను, 51,053 ఎకరాలను నమోదు చేశారు.

జిల్లాలో ఈ క్రాప్ పంట నమోదు ఇలా (ఎకరాల్లో)

సబ్ డివిజన్	రైతులు	నార్మల్ ఏరియా	ఈక్రాప్ చేసిన పొలాలు
అద్దంకి	6,883	30,939	22,875
దర్శి	19,892	65,210	58,199
గిద్దలూరు	19,035	50,361	41,111
కనిగిరి	20,409	70,486	60,562
మార్కాపురం	11,562	36,516	24,933
ఒంగోలు	21,459	95,089	81,493
సింగరాయకొండ	13,576	57,226	51,053
యర్రగొండపాలెం	6,374	23,173	13,548



ఈ క్రాప్ నమోదు చేస్తున్న మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు



రైతులకు ఈ క్రాప్ నమోదు పై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది



ఈ క్రాప్ నమోదుతో లాభాలు

ముఖ్యంగా ఈ క్రాప్ నమోదుతో రైతులకు ఆపద సమయంలో ఉపయోగపడుతుంది.

- ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్‌లు, కరువు వచ్చి పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీకి ఈ క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుంటుంది.
- క్రాప్ ఇన్సూరెన్స్‌కు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి
- రైతులు తాము పండించిన ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చు
- జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం కచ్చితంగా నమోదవుతుంది.
- ప్రణాళిక ప్రకారం వ్యవసాయ అభివృద్ధికి రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల సరఫరాకు ఉపయోగపడుతుంది.
- కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులు ఇచ్చి రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సహాయం కూడా అందించొచ్చు.
- ఉచిత పంటల బీమా, సున్న వడ్డీ పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ శాఖల ఇన్‌పుట్ సబ్సిడీకి ఈ క్రాపింగ్ తప్పనిసరి.

ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలి



ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ పంట కాలాల్లో రైతులు తప్పనిసరిగా ఈ క్రాపింగ్ నమోదు చేయించుకోవాలి. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలకు కచ్చితంగా ఈ క్రాప్ నమోదు తప్పనిసరి. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వీఆర్‌ఓలు ఈ క్రాప్ నమోదు చేశారు.

– శ్రీనివాసరావు, జేడీఏ ఒంగోలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరిక



స్ట్రాంగ్ రూంలో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లాలో సోమవారం జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూం వద్ద భద్రతా ఏర్పాట్లను ఏఎస్పీలు, డీఎస్పీలతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. స్ట్రాంగ్ రూం పరిసరాలు, ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్లు భద్రపరిచే ప్రదేశం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద సెక్యూరిటీ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.

నిబంధనలు ఇలా...

- అభ్యర్థులు, ఏజెంట్లు, ఓటర్లు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.
- అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు మొబైల్ ఫోన్లు, ఐపాడ్, ట్యాబ్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలింగ్ బూత్‌లోకి తీసుకుని వెళ్లకూడదు.
- పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా గుమికూడరాదు.
- అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఎలాంటి చర్యలకు పాల్పడరాదు. పోలింగ్ తేదీకి 48 గంటలకు ముందే ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి.
- ఎన్నికల సందర్భంగా ఎవరైనా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదు. పోలింగ్ బూతు లోపల ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాలలో పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
- ఎన్నికల నేపథ్యంలో 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలి.
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు సమాచారం ఉంటే ఎన్నికల కమిషన్, స్థానిక పోలీసులు, డయల్ 100కు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటారు.

కలిసి పనిచేద్దాం..విజయం సాధిద్దాం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి
- ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించుకోండి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



పొదిలి సమావేశంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

పొదిలి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయులు, పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. పొదిలిలోని దర్శి రోడ్డులో ఉన్న మంజునాథ కళ్యాణ మండలంలో జిల్లాలోని ప్రైవేటు జూనియర్, డిగ్రీ, బీఈడీ కళాశాలల యాజమాన్య మిత్రులు, ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముందుగా బాలినేనికి నాయకులు ఘన స్వాగతం పలికారు. సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తింపు పొందిందన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించుకుంటే వారి ప్రతినిధిగా శాసనమండలిలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సీఎంతో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకునే మంచి అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు, ఉపాధ్యాయుల కష్టాలు తెలిసిన వ్యక్తిని ఎన్నుకోవడం ద్వారా తప్పకుండా సమస్యలు పరిష్కరించుకోగలుగుతామన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ వరకు సమస్యను తీసుకెళ్లి ప్రైవేటు పాఠశాల్లో పనిచేసే అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు తీసుకురాగలిగామన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందని చెప్పారు. అంబానీ, బిర్లా వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలు నేరుగా ఈ సమావేశానికి హాజరుకావడం, 45 దేశాల దేశాల పారిశ్రామిక వేత్తలు ఏపీలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించడం ఎంతో సంతోషకరమన్నారు. 6 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు.

వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కోరారు. ఈ నెల 13వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల నుంచి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల నుంచి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగనన్నకు బహుమతిగా ఇద్దామన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటా: శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటానన్నారు. ఉపాధ్యాయ, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పాఠశాలల గుర్తింపు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెటు వంటి సమస్యలతో పాటు హెల్త్ కార్డులు, కాలనీలు సమస్యల కోసం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వేయాలని కోరారు. అనంతరం ముఖ్యఅతిథులను శాలువతో సత్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్‌మెన్ బాల మురళీకృష్ణ, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు కేవీ రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, ఆకిబ్ అహమ్మద్, గుండారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, షంషీర్ ఆలీబేగ్, మర్రిపూడి, కొనకనమిట్ల ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, మురళి, మండల, పట్టణ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్ బేగం, జిల్లా సేవదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, మాజీ కన్వీనర్ జీ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, కల్లంసుబ్బారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కే నరసింహారావు, ఉలవాగోపి, సచివాలయాల కన్వీనర్ పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, పాల్గొన్నారు.

మార్కాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తాం



డీఆర్‌ఎంకు సమస్యల గురించి వివరిస్తున్న ఆర్‌కేజే నరసింహం

మార్కాపురం: మార్కాపురం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణరావు అన్నారు. శుక్రవారం ఆయన రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి అమృత భారత్ పథకంలో భాగంగా గుంటూరు పరిధిలో 16 స్టేషన్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారని, ఇందులో మార్కాపురం రైల్వే స్టేషన్ కూడా ఉందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఇందులో భాగంగా ప్లాట్‌ఫాంల అభివృద్ధి, కోచ్ ఇండికేషన్ బోర్డ్స్, డిస్‌ప్లేబోర్డ్స్, వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అవసరమైన చోట ఏర్పాటు చేస్తామన్నారు. ప్లాట్‌ఫాం షెల్టర్స్ దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తామని, ఇవన్నీ 2024 మార్చి లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ పనులు చేసేందుకు ప్రైవేట్ ఏజెన్సీని నియమించామని చెప్పారు.

అభివృద్ధికి సహకరించండి

రైల్వే డీఆర్‌సీసీ మెంబర్ ఆర్‌కేజే నరసింహం మాట్లాడుతూ ఉత్తర భారత యాత్రికులు శ్రీశైలానికి రైలు మార్గం ద్వారా రావాలంటే మార్కాపురం రైల్వే స్టేషన్‌లో దిగుతారని స్టేషన్ అభివృద్ధికి సహకరించాలని డీఆర్‌ఎంను కోరారు. రైల్వే స్టేషన్ ఎన్‌ఎస్‌జీ 5 నుంచి 4కు మార్చాలని, పర్యటక కేంద్రంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు రాత్రిపూట బస చేసేందుకు రిటైరింగ్ రూంలు ఏర్పాటు చేయాలని, రుసుము ప్రాతిపదికన ఏసీ రూంలు నిర్మించాలన్నారు. రైళ్ల సమయాలను తెలిపే డిజిటల్ బోర్డులు, కోచ్ ఇండికేషన్ బోర్డులు, 1, 2 ప్లాట్‌ఫాంల మీద ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే స్టేషన్ బయట ఆధ్యాత్మికత ఉండేలా శివ పార్వతులు విగ్రహం ఏర్పాటు చేయాలని, ఉబ్లీ – విజయవాడకు అదనపు భోగీలు ఏర్పాటు చేయాలని, ధర్మవరం–మచిలీపట్నం రైలుకు మార్కాపురంలో స్టాపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని, మార్కాపురం నుంచి హైదరాబాదుకు వయా శావల్యాపురం, నడికుడి మీదుగా రైలును ఏర్పాటు చేయాలని, రేపల్లె నుంచి మార్కాపురం వచ్చే రైలును గిద్దలూరుకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈయన వెంట ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఇన్‌చార్జ్ స్టేషన్ మాస్టర్ ఆచారి, ప్రయాణికుల సంఘం కార్యదర్శి నరసింహచార్యులు తదితరులున్నారు.

బాల్య వివాహాల నిరోధంతో బాలికల సాధికారత

- కలెక్టర్ దినేష్ కుమార్



కిశోర బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధంపై బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: బాల్య వివాహాలను నిరోధించడంతో బాలికల సాధికారత సాధ్యమవుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. డీఆర్‌డీఏ వెలుగు భవనంలో యునిసెఫ్ సౌజన్యంతో మహిళాశిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోలీసు, మెప్మా, డీఆర్‌డీఏ, సర్వశిక్షా అభియాన్, సచివాలయాల నుంచి 50 మందికి కిశోర బాలికల సాధికారత, బాల్య వివాహాల నివారణ అంశాలపై శుక్రవారం మాస్టర్ ట్రైనింగ్ నిర్వహించారు. దీనిలో కలెక్టర్ పాల్గొని సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు 29.6 శాతం, టీనేజ్ ప్రెగ్నెన్సీ 16.4 శాతం ఉందన్నారు. అయితే బాల్య వివాహాల నివారణకు మహిళా పోలీసులతో ప్రతి గ్రామంలో వివాహాలను రిజిస్టర్ చేయిస్తున్నామని చెప్పారు. బాల్య వివాహాలు జరగడం వలన బాలికలు చదవలేకపోవడంతో పాటు చిన్న వయసులోనే గర్భం దాల్చి అనారోగ్యాలకు పాలవుతున్నారన్నారు. ఈ అంశాలపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నివారణకు యంత్రాంగంతో పాటు ప్రజలు బాధ్యత వహించేలా చైతన్య పరచాలన్నారు. మాతృశిశు మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలికల హక్కులు, చట్టాలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, జీఎస్‌డబ్ల్యూఎస్ స్పెషల్ ఆఫీసర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి తరలింపు పక్కాగా చేయాలి

- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించే ప్రక్రియ పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్పందన భవనంలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రక్రియను డివిజన్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మార్గదర్శకాలను పాటించడంలో ఎటువంటి ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. 12వ తేదీ ఉదయం 7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు సిబ్బంది చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామగ్రిని పంపించేందుకు అవసరమైన వివరాల నమోదులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వెబ్ కాస్టింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లను కూడా పోలింగ్ సిబ్బందితో కలిపి ప్రభుత్వం కేటాయించిన వాహనాల్లో పంపాలన్నారు. ప్రైవేటు వాహనాలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఆవరణలోకి అనుమతించవద్దన్నారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం జిల్లా కేంద్రానికి డాక్యుమెంటేషన్ రూపంలో తెలియచేయాలన్నారు. అందుకు అవసరమైన కమ్యూనికేషన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఓటర్లకు పోలింగ్ బూత్‌ల వివరాలు తెలిపేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేటాయించిన విధుల్లో సమన్వయం లోపం లేకుండా చూసుకోవాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో మరో యువకుడు మృతి


మృతుడు కూచిపూడి ప్రభుదాస్

జే.పంగులూరు: బాపట్ల జిల్లా పంగులూరులో గుండెపోటుతో మరో యువకుడు కూచిపూడి ప్రభుదాస్ (32) శుక్రవారం ఉదయం మరణించాడు. పంగులూరు గ్రామానికి చెందిన యువకులు ఈ వారంలోనే ముగ్గురు గుండెపోటుతో మరణించటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత శనివారం పంగులూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాలపర్తి వీరబాబు (45) వేటపాలెం మండలం వాకావారిపాలెంలో విద్యార్థులకు పాఠాలు చెబుతూనే తరగతి గదిలో గుండెపోటుతో చనిపోయాడు. పంగులూరు గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేసే గుంతోటి ఆదినారాయణ (36) పారిశుధ్య పనులు చేస్తూనే గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి చేర్చే లోపే మరణించాడు. తాజాగా కూచిపూడి ప్రభుదాసు ఉదయం టిఫిన్ చేసి, ఇంటిలోకి వచ్చే లోపే గుండెపోటు వచ్చింది. మేదరమెట్ల ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లే లోపే తుది శ్వాస విడిచాడు. ప్రభుదాసు మూడేళ్ల నుంచి హైదరాబాద్‌లో బేల్దారి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. పదిరోజుల క్రితమే పంగులూరు వచ్చాడు. ఇంతలోనే గుండెపోటు వచ్చి మరణించటం పట్ల ఆయన కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మరణించిన ప్రభుదాసుకు భార్య రాగమ్మ, కుమారుడు అలెక్స్, కుమార్తె సిరివెన్నెల ఉన్నారు.

వాహనాల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి


మృతిచెందిన మీరావలి

మార్కాపురం: రెండు లారీల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో బ్రహ్మంగారి గుడి వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలు పట్టణానికి చెందిన మీసాల మీరావలి (45) ఎస్‌ఆర్‌ఎంటీ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం స్థానిక కంభం రోడ్డులో తన లారీ ఆపుకుని నిలబడ్డాడు. అదే సమయంలో ఒక ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన లారీ వస్తుండగా.. ఇక్కడి నుంచి వెళ్లేందుకు స్థలం లేదు.. కాసేపు ఆగాలని ఆ లారీ డ్రైవర్‌కు చెప్పాడు. అయినా వినిపించుకోకుండా ముందుకు రావడంతో రెండు లారీల మధ్య ఇరుక్కుని మీరావలి మృతి చెందాడు. ఆ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం ముందడుగు
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మంత్రి సురేష్


పెద్దదోర్నాలలో ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: పేదరికం లేని సమాజమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి తరపున మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పెద్దదోర్నాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి సురేష్ ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులు, టీచర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు, రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు సీఎం వైఎస్ జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా నిలుస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పేదలు ఆర్థికంగా బలోపేతమయ్యారన్నారు. జగనన్న నాలుగేళ్ల పాలన జవాబుదారీతనంలో సాగిందన్నారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకు వేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారన్నారు. పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో వెలిగొండ టన్నెల్ పనులను వేగవంతంచేసి మొదటి టన్నెల్ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, మండల నాయకులు గుమ్మా యల్లేష్, గంటా గురవారెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్, దూదేకుల రసూల్, షేక్ షరీఫ్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

పుల్లలచెరువు: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. పుల్లలచెరువు మండలంలోని ముటుకుల గ్రామంలో గురువారం రాత్రి సంతాన వేణుగోపాలస్వామి తిరునాళ్లలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రికి అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై మంత్రి సురేష్ మాట్లాడుతూ.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఒక ప్రత్యేక స్థానంలో ఉందంటే అది సీఎం జగనన్న వల్లేనని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమ కోసం ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇటీవల విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు తరలివచ్చిన పారిశ్రామికవేత్తలు వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్నారని, తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. సమ్మిట్ విజయవంతం కావడం టీడీపీకి ఏమాత్రం మింగుడు పడటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టేందుకు తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ యాత్రల పేరుతో బయలుదేరారని, వారిది అధికార కాంక్షే తప్ప మరొకటి కాదన్నారు. పుల్లలచెరువు నుంచి వైపాలేనికి త్వరలో డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తామన్నారు. నీటి ప్రాజెక్టు విషయంలో సీఎం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, త్వరలోనే టి-5, వరికిపూడి సెలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, పార్టీ నాయకులు పిచ్చయ్య, రోశిరెడ్డి, శేషయ్య, కృష్ణారావు, సాంబయ్య, కృష్ణ, కత్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.


ముటుకులలో పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్

విధి ఆడిన ఆట.. తడబడిన మాట!

- గేదెకు వైద్యం చేస్తుండగా యానిమల్ హస్బెండరీ ఉద్యోగికి గాయాలు
- గొంతులో కొమ్ము గుచ్చుకుని దెబ్బతిన్న స్వరపేటిక
- ఆపరేషన్‌కు రూ.6 లక్షలకు పైగా నగదు అవసరం
- దాతలు సాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు


ఇంతియాజ్(ఫైల్)

పీసీపల్లి: పశువుకు వైద్యం చేస్తుండగా యానిమల్ హస్బెండరీ ఉద్యోగికి గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రోజూలాగే పశువులకు వైద్యం చేస్తున్న ఆ చిరుద్యోగికి ఊహించని పరిస్థితి ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే.. పీసీపల్లి మండల పరిధిలోని మురుగమ్మి గ్రామ సచివాలయంలో కనిగిరి పట్టణానికి చెందిన షేక్ ఇంతియాజ్ పశు వైద్య సహాయకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ పశుపోషకుడు తన గేదెకు వైద్యం చేయించేందుకు గురువారం ఇంతియాజ్‌ను సంప్రదించాడు. ఈ క్రమంలో గేదె ఒక్కసారిగా కొమ్ము విసరడంతో ఇంతియాజ్ స్వర పేటిక వద్ద తీవ్ర గాయమైంది. అధికంగా రక్తస్రావం కావడంతోపాటు ఇంతియాజ్‌కు మాట కూడా పడిపోయింది. గ్రామస్తుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో కనిగిరి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, స్థానికంగా కుదరదని చెప్పారు. దీంతో ఇంతియాజ్‌ను హైదరాబాద్ యశోద హాస్పిటల్లో చేర్పించారు. ఇంతియాజ్‌ది పేద కుటుంబం. ఆపరేషన్ చేయడానికి రూ.6 లక్షలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఏం చేయాలో తెలియక తల్లిదండ్రులు మీరావలి, పాక్షాబి తల్లడిల్లిపోతున్నారు. 'పేదోళ్లమయ్యా.. అంత డబ్బు పెట్టి ఆపరేషన్ చేయించే స్థోమత మాకు లేదు. మా బిడ్డ వైద్యానికి సాయం చేసి ఆదుకోండి' అని దాతలను వేడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఉచితంగా వైద్యం చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సాయం చేసే దాతలు ఫోన్ పే నం.9912183734(కొత్త వెంకటేశ్వర్లు)కు నగదు పంపించవచ్చు.


గాయపడిన ఇంతియాజ్


ఆస్పత్రి చికిత్స పొందుతూ..

ప్రైవేట్‌లో 25 శాతం సీట్లు
పేదలకు మాత్రమే..

- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశం
- ఈనెల 16లోగా ప్రైవేట్ పాఠశాలల ఎంపిక
- ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



ఒంగోలు: ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి)ని అనుసరించి 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు పాతిక శాతం సీట్లు కేటాయించనున్నారు. అనాథ పిల్లలు/హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు/దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ/మైనార్టీ/ఈడబ్ల్యుఎస్ వర్గాలకు చెందిన పిల్లలకు 6 శాతం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల చట్టాన్ని అనుసరించి పాఠశాల విద్యాశాఖ జీవో ఎంఎస్ నంబర్ 24ను ఫిబ్రవరి 26న జారీ చేసింది. దీనిపై హైకోర్టులో విచారణ సాగుతున్నందున న్యాయస్థానం ఉత్తర్వులకు లోబడి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకు సంబంధించిన వివరాలు హెచ్‌టీటీపీ://సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

అర్హత : గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే బలహీనవర్గాలకు చెందిన వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండే బలహీనవర్గాల వార్షిక ఆదాయం రూ.1.44 లక్షలలోపు ఉండాలి.

షెడ్యూలు ఇలా..

- ముందుగా ఏయే పాఠశాలలను ఎంపిక చేశారో ఆ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచుతారు. ఇందుకుగాను ఐబీ/ఐసీఎస్‌ఈ/సీబీఎస్‌ఈ/స్టేట్ సిలబస్ పాఠశాలల నమోదు ప్రక్రియను ఈ నెల 16వ తేదీలోగా పూర్తి చేయనున్నారు.
- విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీలోగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఏప్రిల్ 9 నుంచి 12వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- మొదటి జాబితా ఏప్రిల్ 13న విడుదల చేస్తారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో మొదటి జాబితాలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను పాఠశాలలు ఏప్రిల్ 15 నుంచి 21వ తేదీలోగా నిర్ధారిస్తాయి.
- ఏప్రిల్ 25న రెండో జాబితా విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీలోగా పాఠశాలల యాజమాన్యాలు నిర్ధారించనున్నాయి.

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తాం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లాలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తాం. బాలల హక్కుల చట్టం అమలు ద్వారా అర్హత పొందిన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎటువంటి అభ్యంతరాలు తెలియజేయరాదు. పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. – పిల్లి రమేష్‌బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా శనగల కొనుగోలు కేంద్రాలు

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

మద్దిపాడు: జిల్లావ్యాప్తంగా త్వరలో శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మద్దిపాడు వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని చోట్ల శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు రైతుల వద్ద నుంచి శనగలు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఒక క్వింటా శనగల ధర రూ.5,335 ఉందని, శనగల కొనుగోలు జరిగిన పది రోజుల్లోపే నేరుగా రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ఇంకా ఏం కావాలనే విషయాలపై చర్చించారు. రైతులందరికీ ఈకేవైసీ చేయించాలని వీఏఏలను ఆదేశించారు. రబీ ముగిసిన తర్వాత పొలాలు ఖాళీగా ఉంచకుండా రైతులతో చిరుధాన్యాలు సేద్యం చేయించేలా ప్రోత్సహించాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో వీఏఏలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, ట్రైనింగ్ సెంటర్ ఏడీఏ ప్రభాకర్, మండల వ్యవసాయ శాఖ అధికారి కే రమేష్‌బాబు, పశువైద్యశాఖ ఏడీఏ రామారావు, రైతులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

కొత్తపట్నం: యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈతముక్కల గ్రామానికి చెందిన బక్కా వెంకటేశ్వర్లు (45) రొయ్యల చెరువులు దగ్గర వాచ్‌మన్‌గా పనిచేస్తూ ఉంటాడు. రోజూవారీ విధంగా ఈ నెల 8న రాత్రి రొయ్యల చెరువుల దగ్గరకు డ్యూటీకి వెళ్లాడు. ఏమయిందో తెలియదు కానీ.. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు గ్రామమంతా గాలించగా ఈతముక్కలలో మద్యం దుకాణం పక్కన నీటి గుంతలో శవమై కనిపించాడు. సంఘటన స్థలానికి ఎస్సై కొక్కిలగడ్డ మధుసూధన్‌రావు తమ సిబ్బందితో చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బహర్భూకి వెళ్లి నీటి గుంటలో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు అన్న బక్కా శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

చోరీ కేసుల్లో ముగ్గురికి 3 నెలల జైలు

పొదిలి: దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు మూడు నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ పొదిలి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. గత ఏడాది పొదిలిలో ఓ గృహంతోపాటు విద్యుత్ సామగ్రి, ద్విచక్ర వాహనాల చోరీల పై స్థానిక పోలీసులు కేసులలు నమోదు చేశారు. మాచర్ల మండలం చెంచు కాలనీ పెద్ద చెరువుకట్టకు చెందిన శీలం తిరుపతయ్య, సవరం నీలయ్య, కొమరగిరి లీలయ్య చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ముగ్గురు నిందితులపై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి మూడు నెలల జైలు శిక్ష విధించారని ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్

శనివారం
11-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 671	59,135
నిఫ్టీ ▽ 177	17,413

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,233	▽ 105
డోజోన్స్	32,093	▽ 161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,748	▽ 132
డాక్స్	15,428	▽ 205
షాంఘై	3,230	▽ 46
నికాయ్	28,144	▽ 479

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	55,669	△ 383
బంగారం (22 క్యారెట్)	55,446	△ 381
వెండి (కిలో)	61,791	▽ 2

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.38	83.05
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	96.38	99.64
€	యూరో	ఒకటి	85.60	88.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	59.23	61.15
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.93	55.28
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.68	61.62
SAR	సౌదీ రియాల్	పదింటికి	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.44	23.23
¥	చైనా యువాన్	పదింటికి	10.69	12.76

హెచ్‌యూఎల్ ఎండీగా రోహిత్ జావా

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నూతన ఎండీ, సీఈవోగా రోహిత్ జావా నియమితులయ్యారు. దశాబ్ద కాలంపాటు నాయకత్వం వహించి పదవీ



విరమణ చెందుతున్న సంజీవ్ మెహతా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం లండన్‌లో యూనిలీవర్ ట్రాన్స్‌ఫర్మేషన్ చీఫ్‌గా జావా ఉన్నారు. అయిదేళ్ల కాలానికిగాను ఎండీ, సీఈవోగా 2023 జూన్ 27న బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 1న కంపెనీ శాశ్వత డైరెక్టర్‌గా హెచ్‌యూఎల్ బోర్డులో చేరనున్నారు. యూనిలీవర్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్‌గానూ ఆశీనులు కానున్నారు.

సెమీకండక్టర్ల రంగంలో మరింత సహకారం

భారత్, అమెరికా మధ్య ఎంవోయూ

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా భారత్, అమెరికా శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత్–అమెరికా వాణిజ్య చర్చల్లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందం.. సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థ ఏర్పాటు, ఆవిష్కరణల అంశాల్లో కలిసి పనిచేసేందుకు తోడ్పడనుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమొండో చర్చించారు. ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదగాలన్న భారత్ ఆకాంక్షలకు ఈ ఎంవోయూ ద్వారా తోడ్పాటు లభించగలదని అమెరికా భావిస్తున్నట్లు రైమొండో తెలిపారు. పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని గోయల్ వివరించారు.



సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్ అమెరికా వాణిజ్య మంత్రులు

పారిశ్రామిక ఉత్పత్తి ఓకే!

- జనవరిలో ఐఐపీ 5.2 శాతం అప్
- విద్యుత్, తయారీలు బాగున్నాయ్

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి 2023 జనవరిలో మంచి పనితీరును కనబరిచింది. ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) 5.2



శాతం పెరిగింది. 2022 డిసెంబర్‌లో సూచీ పెరుగుదల రేటు 4.7 శాతంగా ఉంది. ఇక 2022 జనవరిలో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 2 శాతం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం విద్యుత్, తయారీ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.

రంగాల వారీగా ఉత్పత్తి గణాంకాలు (శాతాల్లో)

	2023 జనవరి	2022 డిసెంబర్
తయారీ	3.7	2.6
మైనింగ్	8.8	9.8
విద్యుత్	12.7	10.4
క్యాపిటల్ గూడ్స్	11.0	7.6
కన్జూమర్ డ్యూరబుల్స్	- 7.5	- 10.4
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	6.2	7.2
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.1	8.2
ప్రైమరీ గూడ్స్	- 9.6	8.3
ఇంటర్మీడియట్ గూడ్స్	-0.1	-0.3

ఏప్రిల్ నుంచి జనవరి వరకూ ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 5.4 శాతంకాగా, 2021-22 ఇదే కాలంలో ఈ రేటు 13.7 శాతం.

అంబుజాలో అదానీ 4.5 శాతం వాటాల విక్రయం

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోవడంపై అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ దృష్టి పెడుతున్నారు. ఇందులో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని విలువ సుమారు 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,380) ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.



ఇందుకు సంబంధించి ఆర్థిక సంస్థలను కూడా సంప్రదించినట్లు పేర్కొన్నాయి. గతేడాది కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్‌లో అదానీకి 63 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ రుణ భారం దాదాపు 24 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో గ్రూప్ కంపెనీల షేర్లు ఇటీవల భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ కొన్ని క్రమంగా కోలుకుంటున్నాయి.

ఐపీవోకు టాటా టెక్నాలజీస్

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. గ్లోబల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అందించే టాటా టెక్నాలజీస్ ఐపీవో సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి తాజాగా



ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌కు ఇది అనుబంధ సంస్థకాగా.. ఇంతక్రితం ఐటీ సేవల నంబర్ వన్ కంపెనీ టీసీఎస్ 2004లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఐపీవోలో భాగంగా టాటా టెక్నాలజీస్ 9.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది.

గ్లోబల్ సర్ఫేసెస్ @ రూ. 133-140

నేచురల్ స్టోన్స్ ప్రాసెసింగ్, ఇంజనీర్డ్ క్వార్ట్జ్ తయారీ కంపెనీ గ్లోబల్ సర్ఫేసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సోమవారం(13న) ప్రారంభం కానుంది. బుధవారం (15న) ముగియనున్న ఇష్యూకి షేరుకి రూ. 133–140 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 155 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా 85.2 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.

మార్కెట్లకు గ్లోబల్ షాక్

- రెండో రోజూ భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్
- 59,135 వద్ద ముగింపు
- 177 నష్టంతో 17,413కు నిఫ్టీ



ముంబై: యూఎస్‌కు చెందిన ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ నిధుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంటుకు దెబ్బ తగిలింది. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు కోల్పోయి 59,135 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177 పాయింట్లు క్షీణించి 17,413 వద్ద నిలిచింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,885ను తాకింది. ఒక్క రోజులోనే బీఎస్ఈ మార్కెట్ విలువలో రూ. 1.36 లక్షల కోట్లు ఆవిరైంది. రూ. 2,62,94,724 కోట్లకు చేరింది.

బ్యాంకింగ్‌కు దెబ్బ

అంచనాలకు మించి వడ్డీ రేట్లు పెరగవచ్చన్న యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలు, ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్‌పై ఆందోళనలు ఇన్వెస్టర్లలో భయాలకు కారణమయ్యాయి. దీంతో దేశీయంగా బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎన్ఎస్ఈలో బ్యాంకింగ్, మీడియా, రియల్టీ, మెటల్, ఐటీ 2–1 శాతం నీరసించాయి. ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యురబుల్స్ స్వల్పంగా బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, అపోలో హాస్పిటల్స్, ఇండస్ఇండ్, ఎస్‌బీఐ, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ, ఎల్అండ్‌టీఆర్ఐఎల్, కొటక్ బ్యాంక్ 3–1 శాతం మధ్య క్షీణించాయి. టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మారుతీ, బ్రిటానియా, పవర్‌గ్రిడ్, టైటన్ 1–0.4 శాతం మధ్య బలపడ్డాయి.

మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్

న్యూయార్క్: ఇన్సూర్డ్ డిపాజిట్ల రక్షణకు వీలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ని మూసివేసినట్లు కాలిఫోర్నియా ఆర్థిక పరిరక్షణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఫైనాన్షియల్ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఐసీ చేతికి అప్పగించినట్లు శుక్రవారం వెల్లడించింది. ప్రధానంగా సిలికాన్ వ్యాలీ, టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ ఆర్థిక సంక్షోభంలో పడింది. బ్యాంక్ పోర్ట్‌ఫోలియోలో భారీ నష్టాలు నమోదుకావడంతో నిధుల సమీకరణకు తెరతీసింది. బాండ్ల పోర్ట్‌ఫోలియోలో నష్టాలు నమోదు చేస్తున్న 21 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,72,000 కోట్లు) విలువైన బాండ్లను విక్రయించినట్లు ఎస్‌వీబీ వెల్లడించింది. దీంతో 1.8 బిలియన్ డాలర్ల చిల్లు పడినట్లు తెలియజేసింది. ఫలితంగా బ్యాలన్స్‌షీట్ పటిష్టత కోసం 2.25 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో నికర వడ్డీ ఆదాయం భారీగా క్షీణించవచ్చని బ్యాంక్ అంచనా వేసింది. యూఎస్ వెంచర్ క్యాపిటల్(వీసీ) దన్నున్న మొత్తం స్టార్టప్‌లలో సగానికిపైగా ఎస్‌వీబీ ఫైనాన్షియల్ సేవలందిస్తోంది. కస్టమర్లలో గతేడాది ఐపీవోకు వెళ్లిన 44 శాతం టెక్, హెల్త్‌కేర్ కంపెనీలుండటం గమనార్హం! జాబితాలో పింటెరెస్ట్ ఇంక్, షాపిఫై ఇంక్, సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ హోల్డింగ్స్ తదితరాలున్నాయి. వెరసి పలు వీసీ సంస్థలు ఎస్‌వీబీతో పోర్ట్‌ఫోలియో బిజినెస్‌లను తగ్గించుకోవడంతోపాటు నగదును వెనక్కి తీసుకునే యోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంక్‌పట్ల విశ్వాసం ఉంచవలసిందిగా క్లయింట్లు, వీసీ ఇన్వెస్టర్లను ఎస్‌వీబీ సీఈవో గ్రెగ్ బెకర్ అభ్యర్థించారు.

బ్యాంక్ షేర్లకు సెగ

ఎస్‌వీబీ ఆర్థిక సంక్షోభ ఆందోళనలకుతోడు సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ మూతపడటంతో ఇన్వెస్టర్లలో భయాలు అధికమయ్యాయి. ఇటీవలే ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వడం దీనికి జత కలిసింది. ఫలితంగా గురువారం కేబీడబ్ల్యూ బ్యాంక్ ఇండెక్స్ 8% కుప్పకూలింది. యూఎస్ దిగ్గజాలు బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, జేపీ మోర్గాన్ షేర్లు 5%స్థాయిలో పతనమయ్యాయి.

కనెక్ట్ స్మార్ట్ సన్‌గ్లాసెస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ కనెక్ట్ గ్యాడ్జెట్స్ రిథమ్ పేరుతో బ్లూటూత్ కాలింగ్ స్మార్ట్ సన్‌గ్లాసెస్‌ను ఆవిష్కరించింది.



ఎండ నుంచి రక్షణతోపాటు ఫోన్ కాల్స్ అందుకోవచ్చు. పాటలు వినొచ్చు. స్పెషల్ లాంచ్ ఆఫర్ ధర రూ. 1,999. నాలుగు గంటల ప్లేబ్యాక్ టైమ్ అందిస్తుంది. మార్కెట్లోకి విడుదల చేసిన 3 రోజుల్లోనే 20,000 యూనిట్లు విక్రయించామని కంపెనీ కో–ఫౌండర్ ప్రదీప్ యెర్రగుంట్ల తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-3-2023	
విశాఖ	430–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423–00
విజయవాడ	423–00
రిటైల్ ధర (డజను)	66.00
10-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

సాక్షి స్పోర్ట్స్

జర్మనీపై భారత్ విజయం

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో కీలక గెలుపు చేరింది. రూర్కెలాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో ప్రపంచ చాంపియన్ జర్మనీపై సంచలన విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ నిమిషం) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ రెండు ఫీల్డ్ గోల్స్ (31వ ని., 42వ ని.) నమోదు చేశాడు. జర్మనీ నుంచి రెండూ ఫీల్డ్ గోల్స్ వచ్చాయి. 44వ నిమిషంలో కాఫ్‌మన్ పాల్ ఫిలిప్, 57వ నిమిషంలో స్ట్రతఆఫ్ మైకెల్ గోల్స్ కొట్టారు. మూడో క్వార్టర్ ముగిసే సరికి భారత్ 3–1తో ఆధిక్యంలో నిలిచినా... చివరి క్వార్టర్‌లో జర్మనీ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీని భారత్ సద్వినియోగం చేసుకోగలిగింది. భారత్ తమ తర్వాతి పోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుంది.



మన బ్యాటర్లపైనే భారం



అశ్విన్

భారత్, ఆస్ట్రేలియా ఆఖరి టెస్టు పరుగుల బాట పట్టింది. గ్రీన్ శతకం సహాయంతో కంగారూలు భారీ స్కోరు నమోదు చేశారు. ఒక ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఈ సిరీస్‌లో ఇదే మొదటిసారి. ఇక మన జట్టు ఎన్ని పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఆడిన పది ఓవర్లలో చక్కటి షాట్లతో ఎలాంటి ప్రమాదం లేకుండా రెండో రోజును ముగించిన టీమిండియా... మూడో రోజూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చెలరేగాల్సి ఉంది.

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 36/0
- ఆస్ట్రేలియా 480 ఆలౌట్
- కామెరాన్ గ్రీన్ సెంచరీ

అహ్మదాబాద్: ఈ సిరీస్‌లో స్పిన్ మాయలో, వికెట్ల వేటలో విజయవంతమైన బౌలర్లకు చివరి టెస్టు కఠినమైన సవాల్ విసురుతోంది. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించిన మోదీ మైదానంలో రెండో రోజూ పరుగుల జోరు కొనసాగింది. అశ్విన్ (6/91) ఆరు వికెట్లతో ఆకట్టుకోగా... అప్పటికే పర్యాటక ఆసీస్ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (422 బంతుల్లో 180; 21 ఫోర్లు) డబుల్ సెంచరీ అవకాశం కోల్పోగా, కామెరాన్ గ్రీన్ (170 బంతుల్లో 114; 18 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి శతకం బాదాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ పది ఓవర్లు ఆడి వికెట్ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (17 బ్యాటింగ్; 2 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

ద్విశతక భాగస్వామ్యం...

రెండో రోజు తొలి సెషన్‌లో కూడా ఆస్ట్రేలియా ఆధిపత్యమే కొనసాగింది. 255/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఉస్మాన్ ఖాజా– గ్రీన్ జోడీ భారత బౌలింగ్‌పై పైచేయి సాధించింది. దీంతో జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. లంచ్ బ్రేక్‌కు ముందే ఖాజా 150 మార్క్‌ను దాటగా, గ్రీన్ సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచాడు. 347/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగియగా, రెండో సెషన్ మొదలైన కాసేపటికే గ్రీన్ టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. ఐదో వికెట్‌కు ఉస్మాన్ ఖాజా, గ్రీన్ 208 పరుగులు జోడించారు. 1979 తర్వాత భారత్ గడ్డపై ఆస్ట్రేలియా జోడీ నమోదు చేసిన ద్విశతక భాగస్వామ్యం ఇదే! ఆతిథ్య జట్టును అష్టకష్టాలు పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్ విడగొట్టాడు. గ్రీన్‌ను అవుట్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యారీ (0)ని కూడా పెవిలియన్ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో స్టార్క్ (6)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఈ పర్యటనలో తొలిసారి 400 పరుగుల మైలురాయిని చేరుకోగా, 409/7 వద్ద టీ విరామానికి వెళ్లారు.

విసిగించిన మర్ఫీ, లయన్

ఆఖరి సెషన్లో డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న ఖాజాకు అక్షర్ పటేల్ చెక్ పెట్టాడు. ఇంకేం మిగతా రెండు వికెట్లను కూల్చేయడం సులభమే అనుకున్న భారత్‌కు టెయిలెండర్లు టాడ్ మర్ఫీ (61 బంతుల్లో 41; 5 ఫోర్లు), లయన్ (96 బంతుల్లో 34; 6 ఫోర్లు) చెమటలు పట్టించారు. ఇద్దరు 19.2 ఓవర్లు ఆడటంతో ఆతిథ్య బౌలర్లు శ్రమించక తప్పలేదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చిన పిచ్‌పై ఈ స్పెషలిస్టు బౌలర్లు చక్కగా బ్యాటింగ్ చేశారు. వీలుచిక్కిన బంతిని బౌండరీలకు తరలించారు. ఇక ఒక దశలో 500 పరుగులు దాటిస్తారనిపించింది. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. అయితే అశ్విన్ వరుస ఓవర్లలో మర్ఫీ, లయన్‌ను అవుట్ చేయడంతో ఆసీస్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఖాజా (ఎల్బీ) (బి) అక్షర్ 180; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ (సి) భరత్ (బి) అశ్విన్ 114; క్యారీ (సి) అక్షర్ (బి) అశ్విన్ 0; స్టార్క్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 6; లయన్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 34; మర్ఫీ (ఎల్బీ) (బి) అశ్విన్ 41; కునెమన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (167.2 ఓవర్లలో ఆలౌట్) 480. వికెట్ల పతనం:** 1–61, 2–72, 3–151, 4–170, 5–378, 6–378, 7–387, 8–409, 9–479, 10–480. **బౌలింగ్:** షమీ 31–3–134–2, ఉమేశ్ 25–2–105–0, అశ్విన్ 47.2–15–91–6, జడేజా 35–5–89–1, అక్షర్ 28–8–47–1, అయ్యర్ 1–0–2–0.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ బ్యాటింగ్ 17; గిల్ బ్యాటింగ్ 18; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 36. బౌలింగ్:** స్టార్క్ 3–1–7–0, గ్రీన్ 2–0–11–0, లయన్ 3–0–14–0, కునెమన్ 2–0–3–0.

611 ఖాజా బ్యాటింగ్ చేసిన నిమిషాలు. భారత్‌లో ఒక ఆసీస్ బ్యాటర్ సుదీర్ఘ ఇన్నింగ్స్ ఇదే. ఆసీస్ తరఫున బంతులపరంగా (422) కూడా ఖాజాదే రికార్డు. గతంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (యూనిస్‌ఖాన్, ఆమ్లా, జయవర్ధనే) మాత్రమే భారత్‌లో 10 గంటలకు పైగా బ్యాటింగ్ చేయగలిగారు.

32 ఇన్నింగ్స్‌లో అశ్విన్ 5 వికెట్లు పడగొట్టడం ఇది 32వ సారి. భారత గడ్డపై కుంబ్లే (25 సార్లు) పేరిట ఉన్న రికార్డును అతను (26) అధిగమించాడు. ఆసీస్‌పై అత్యధిక వికెట్లు (113) తీసిన భారత బౌలర్‌గా కూడా కుంబ్లే (111) రికార్డును అశ్విన్ సవరించాడు.



గ్రీన్

కమిన్స్ ఇంట్లో విషాదం

సిడ్నీ: ఆస్ట్రేలియా టీమ్ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తల్లి మారియా కన్నుమూసింది. చాలా ఏళ్లుగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అయితే రెండు వారాల క్రితం మారియా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దాంతో తల్లిని చూసుకునేందుకు కమిన్స్ భారత్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వెళ్లాడు. ఆమె కోలుకోకపోవడంతో అక్కడే ఉండిపోయాడు. మారియా మృతి పట్ల ఇరు దేశాల క్రికెట్ బోర్డులు సంతాపం ప్రకటించగా...ఆస్ట్రేలియా క్రికెటర్లు సంతాపసూచకంగా శుక్రవారం భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి మైదానంలోకి దిగారు.

బెంగళూరుకు నాలుగో ఓటమి

- 10 వికెట్లతో యూపీ జయభేరి
- చెలరేగిన ఎకిల్‌స్టోన్, హీలీ
- డబ్ల్యూపీఎల్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇంకా బోణీకొట్టని బెంగళూరు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన పోరులో అలీసా హీలీ (47 బంతుల్లో 96 నాటౌట్; 18 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీల విధ్వంసంతో యూపీ వారియర్స్ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు 19.3 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ స్మృతి మంధాన (4) నిరాశపర్చగా, సోఫీ డివైన్ (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలైస్ పెర్రీ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 44 పరుగులు జత చేశారు. అయితే జట్టు స్కోరు 73 పరుగుల వద్ద సోఫీ అవుటయ్యాక పరిస్థితి మారింది. పెర్రీ క్రీజులో ఉన్నప్పటికీ అవతలి వైపు నిలబడే బ్యాటరే కరువయ్యారు. కనిక (8), హీథెర్ నైట్ (2), శ్రేయాంక (15), బర్న్స్ (12) ఇలా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ 13 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 139 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ, దేవిక వైద్య (31 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు) ఇంకా 7 ఓవర్లు మిగిలుండగానే అజేయంగా ముగించారు.



హీలీ



ఎకిల్‌స్టోన్

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూజిలాండ్ 162/5

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కష్టాల్లో పడింది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (67) అర్ధ సెంచరీ సాధించగా... డరైల్ మిచెల్ (40 బ్యాటింగ్), కాన్వే (30) రాణించారు. కుమార, అసిత చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 305/6తో ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగులకు ఆలౌటైంది. సౌతీ 5, హెన్రీ 4 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్ మరో 193 పరుగులు వెనుకబడి ఉంది.

దక్షిణాఫ్రికా 287/7

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. కెప్టెన్ తెంబా బవుమా (275 బంతుల్లో 171 బ్యాటింగ్; 20 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగగా...ముల్డర్ (42) రాణించాడు. 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన సఫారీ టీమ్‌ను బవుమా ఒంటి చేత్తో ఆదుకున్నాడు. బవుమా, ముల్డర్ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. విండీస్ బౌలర్లలో మేయర్స్, అల్జారి జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 356 పరుగుల ఆధిక్యంలో ఉంది.